క్లుప్తంగా

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, ఆరుగురికి షాదీముబారక్ చెక్కులను బుధవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇఫ్తేకార్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ జమీర్

కెరమెరి: ఆదిమ గిరిజనులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జమీర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ చాలా మంది తమ పేర్లను నమోదు చేసుకోలేదని, 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఫామ్ నంబర్ 6 పూరించి ఇవ్వాలన్నారు. తమ పూర్తి చిరునామాతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని జత చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం లక్ష్మణ్, సిడాం ధర్మూ, భీంరావు ఉన్నారు.

'గోండుకొసార'లో డ్రై డే




పిచికారీని పరిశీలిస్తున్న హెచ్ఈవో

వాంకిడి: మండలంలోని గోండుకొసార గ్రామంలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈవో రవిదాస్ పర్యవేక్షణలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేశారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం హెచ్ఈవో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీటీడీఏ అధ్యక్షుడు గోపాల్ రావు, హెచ్ఏ భగవాన్‌దాస్, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని మోతుగూడ, అప్పపల్లి గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ అధికారి మురళీ కృష్ణతో కలిసి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం అప్పపల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

'సమగ్రశిక్ష' కమిటీ ఎన్నిక



సమగ్రశిక్ష ఉద్యోగుల నూతన కమిటీ

దహెగాం: మండల సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శశికళ, గౌరవ అధ్యక్షురాలిగా మధుసుశ్రీ, ఉపాధ్యక్షులుగా లలిత, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్, సహాయ కార్యదర్శులుగా రజిత, రవీందర్, కోశాధికారిగా శేఖర్, అధికార ప్రతినిధిగా రిజ్వానలను ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

తిర్యాణి: ఈనెల 27న కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి పిలుపునిచ్చారు. బుధవారం మహాసభకు సంబంధించిన పోస్టర్లను మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక వ్యతిరేఖ విధానాలపై చర్చించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమైన బీసీ బాలికల డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంజేపీ గురుకులాల కన్వీనర్ వెంకట ప్రసాద్ తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు బాబాపూర్‌లోని ఎంజేపీ గురుకులంలో ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

కార్మికులకు 'బీమా'తో భరోసా

- ఉచితంగా బీమా కల్పించేందుకు ప్రభుత్వ నిర్ణయం
- అంత్యక్రియలకు అందించే మొత్తం రూ.10వేలకు పెంపు
- జిల్లాలో 1221 మంది కార్మికులకు చేకూరనున్న ప్రయోజనం



మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

రెబ్బెన: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి వారికి సామాజిక భద్రత కల్పించేలా చర్యలు చేపట్టింది. మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టి మంచి వేతనాన్ని అందించింది. పంచాయతీల్లో చేపట్టే అన్ని రకాల పనులను కార్మికుల ద్వారా చేపడుతూ వస్తోంది. ప్రభుత్వం అందించే వేతనాలు తప్పా మరే ఇతర ప్రయోజనాలు వారికి లేకపోవడంతో కార్మికులు ఆందోళన చెందేవారు. ఈక్రమంలో ప్రభుత్వం ప్రతీ పంచాయతీ కార్మికుడికి ఉచితంగా బీమా కల్పించాలని నిర్ణయించింది.

పంచాయతీ నుంచే ప్రీమియం..

గ్రామాల్లో మురికికాలువలు, రోడ్లు శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టడం, క్లోరినేషన్ పనులను పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్నారు. కాగా కార్మికులు అనారోగ్యం బారిన పడినా, వివిధ కారణాలతో మరణించిన ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందేది కాదు. ఈ తరుణంలో ప్రభుత్వం కార్మికులకు బీమాతో భరోసా కల్పించాలని కీలక నిర్ణయం తీసుకుంది. బీమాకు సంబంధించిన ప్రీమియం డబ్బులు పంచాయతీనే భరించి కార్మికులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టింది. పథకం కింద నమోదైన కార్మికుడు మరణిస్తే నామినీకి రూ. 5లక్షల బీమా డబ్బులు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందుకు అనుగుణంగా బీమా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

1221 మందికి ప్రయోజనం

పంచాయతీ కార్మికులకు ఉచితంగా బీమా సౌకర్యం అమలులోకి వస్తే జిల్లాలోని 334 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 1221 మంది పంచాయతీ కార్మికులకు ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీల వారీగా పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను పంచాయతీ కార్యదర్శుల నుంచి సేకరించారు. ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు రాగానే బీమా ప్రీమియానికి సంబంధించిన డబ్బులను పంచాయతీల నుంచి చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. గతంలో పంచాయతీ కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.5వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి అందించేవారు. తాజాగా ఆ మొత్తాన్ని రూ. 10వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని సైతం పంచాయతీ నిధుల నుంచే చెల్లించనున్నారు.

కార్మికుల వివరాలు సేకరించాం

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని మండలాల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలు సేకరించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే గ్రామపంచాయతీ నిధుల్లో నుంచి ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం కల్పిస్తాం. త్వరలోనే జిల్లాలో కార్మికులకు బీమా సౌకర్యం అమలయ్యేలా చూస్తాం. - సురేందర్, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి

మోకాళ్లపై 2వ ఏఎన్ఎంల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న 2వ ఏఎన్ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 2వ ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, దివాకర్‌లు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిల్చొని 2వ ఏఎన్ఎంలు తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షుడు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు భాగ్య, ప్రచార కార్యదర్శి భూదేవి, నాయకులు ప్రమీల, సునీత, పద్మ, రాజేశ్వరి, తిరుమల మంగ, లీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కాగజ్‌నగర్‌టౌన్: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ఎం.ఆనంద్ కుమార్, జి.లక్ష్మి, సరోజా, సరస్వతి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట సామాజిక ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

చింతలమానెపల్లి: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బాబాపూర్ -రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అజీముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 32సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షుడు ఎం.ప్రమీల, ఉపాధ్యక్షులు బి.అనూరాధ, సంఘం నాయకులు హంస, జి.లక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న 104 ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులను సీఎం ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కన్వీనర్ మహేంద్ర డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన సమ్మెకు సంబంధించిన నోటీసును డీఎంహెచ్‌వో రామకృష్ణకు తన కార్యాలయంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ప్రభుత్వం ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజేశం, తిరుపతి, రవి, తూర్పకళ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనకయాదవ్‌రావ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలు తెప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా నిబంధనల మేరకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం అన్నారు. బుధవారం కళాశాలలో టాస్క్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్ జి.సాయికుమార్, కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ టి.దత్తాత్రేయ, లెక్చరర్లు డి.జనార్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ టికెట్ సరస్వతికి ఇవ్వాలి'

తిర్యాణి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మర్సుకోల సరస్వతిని బరిలోకి దించాలని ఉమ్మడి మంగి పంచాయతీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ తెగకు చెందిన సరస్వతికి అవకాశం ఇవ్వడం ద్వారా నియోజకవర్గంలో అత్యంత వెనుకబడి ఉన్న ఆదివాసీలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిసిడాం వినోద్, రాజేశ్ చిన్ను, సాగర్ తదితరులు ఉన్నారు.

'స్థానిక అభ్యర్థులకే బీఫామ్ ఇవ్వాలి'

కెరమెరి: స్థానిక అభ్యర్థులకే అన్ని పార్టీలు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు బీఫామ్‌లు ఇవ్వాలని సేవలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాన్‌లోకల్ అభ్యర్థికి టికెట్ ఇస్తే రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. జిల్లా నాయకులు వస్రాం నాయక్, బాదావత్ శివాజీ, తిరుపతి, అంబాజీ, ప్రదీప్, రవి, వెంకటి తదితరులు ఉన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులకు ఆహ్వానం

కెరమెరి: డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతీ, యువకులు లైసెన్స్ కోసం గురువారం కెరమెరి పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కా ర్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రెండు పా స్‌ఫోటోలు జత చేసి దరఖాస్తు సమర్పించాలన్నా రు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఉచితంగా లైసెన్స్‌లు ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కళ్లకు గంతలు కట్టి నిరసన



నిరసన తెలుపుతున్న భగీరథ కార్మికులు

కెరమెరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కెస్లాగూడ పంప్‌హౌస్ వద్ద మిషన్ భగీరథ కార్మికులు కళ్లకు గంతలు కట్టి నిరస న తెలిపారు. కార్మికులకు ఐదు నెలల వేతనాలు వి డుదల చేయాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పెంచికల్‌పేట్‌లో భారీ వర్షం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. కొండపల్లి -లోడుపల్లి గ్రామాల వద్ద బొక్కివాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. పెంచికల్‌పే ట్ -లోడుపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు పారడంతో సుమారు గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

దరఖాస్తులకు రేపే లాస్ట్ డేట్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ జవహార్ నవోదయ విద్యాలయంలో 2024 -25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి జరిగే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 25తో ముగుస్తుందని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 5వ తరగతి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు కాగజ్‌నగర్‌టౌన్ సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఫోన్లను అప్పగించారు. కాగజ్‌నగర్‌కు చెందిన వెంకటేష్, వనిత, సునీల్‌లు మొబైల్ ఫోన్లను కొన్ని రోజుల క్రితం పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా పోయిన ఫోన్లను గుర్తించిన పోలీసులు బాధితులకు అందించారు.

యువకుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రానికి చెందిన గాదం రాజు ఇటీవల విడుదలైన ఫలితాల్లో సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ)లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించగా బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు యువకుడిని సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీధర్, ఉపాధ్యాయులు నగేష్, లక్ష్మి, భారతి, రమాదేవి, శ్రీనివాస్, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రయాన్ -3 విజయవంతం కావాలని పూజలు



రెబ్బెన: పూజలు చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్: దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రెబ్బెన: చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతం కావాలని బుధవారం మండల కేంద్రంలోని సీతారామాలయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ప్రకాష్ అగర్వాల్, రాజ్‌కుమార్ అగర్వాల్, నాయకులు రాంబాబు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: చంద్రయాన్ 3 విజయవంతం కావాలని బీజేపీ నాయకులు ఆలయాల్లో పూజలు చేశారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పాత హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణానికి వచ్చిన మహారాష్ట్ర ఎమ్మెల్యే శ్రీ బంటి భావు బాంగ్డియా పాల్గొన్నారు.

సిర్పూర్(టి): చంద్రయాన్ 3 విజయవంతం కావాలని మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీపూర్ గ్రామస్తులు, భజరంగ్ దళ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు చేశారు. శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయంలో ఆలయ అర్చకుడు గంగు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు.

దర్గాలో ప్రార్థనలు

ఆసిఫాబాద్: చంద్రయాన్ 3 విజయవంతం కావాలని జిల్లా కేంద్రంలోని జమెదార్ బాబా దర్గాలో బుధవారం ముస్లింలు ప్రార్థనలు చేశారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూజలు

రెబ్బెన: ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ హిందు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు గోలెం విలాస్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శులు జగన్నాథ ఓదెలు, నవీన్ గౌడ్ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

చంద్రయాన్- 3 వీక్షించిన విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: మోడల్ స్కూల్‌లో..

ఆసిఫాబాద్‌రూరల్: చంద్రయాన్ 3 ప్రయోగాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, గురుకుల వసతి గృహం పాఠశాలలో విద్యార్థులు వీక్షించారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

కౌటాల: చంద్రయాన్ 3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను కౌటాలలోని మయూరి విద్యాలయం విద్యార్థులు బుధవారం సాయంత్రం టీవీలో వీక్షించారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యాలయం కరస్పాండెంట్ శాగంటి యాదగిరి, హెచ్ఎం కృష్ణ, తదితరులు ఉన్నారు.

చంద్రయాన్ 3 విజయంతో సంబురాలు



కన్నెపల్లిలో సంబురాలు చేసుకుంటున్న యువకులు

కౌటాల: చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బుధవారం రాత్రి మండలంలోని కన్నెపల్లి గ్రామంలో యువకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీసీ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడం భారతదేశ ప్రజలకు గర్వకారణమన్నారు. గ్రామ యూత్ అధ్యక్షుడు పండురంగ్, యూత్ సభ్యులు గురుజీ, రమేశ్, గణపతి, తరుణ్, గణేశ్, మోహన్, నాగేశ్, మొండి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో దేశ ప్రజలకు ఆనందానికి అవధులు లేవన్నారు. కార్యక్రమంలో ఈదులవాడ గణేశ్, జయరాం పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఇస్రో విజయంపై కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం సంబురాలు అంబరాన్నంటాయి. బీజేపీ, బీఆర్ఎస్, వివిధ సంఘాల ఆధ్వర్యంలో యువకులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేపట్టారు. రాజీవ్ గాంధీ, అంబేద్కర్, తెలంగాణ తల్లి చౌరస్తాల్లో భారీ ఎత్తున టపాసులు కాల్చి హోరెత్తించారు.

కోవ లక్ష్మికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఆసిఫాబాద్: బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా బుధవారం పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. రాజేంద్రప్రసాద్ బీఎడ్ కళాశాల నుంచి కోవ లక్ష్మి నివాసం వరకు బ్యాండ్ మేళాతో బైక్‌ర్యాలీతో వందలాది మంది పార్టీ నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి బుధవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ గ్రామంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ సువర్ణ, మాధవి, భీమేశ్, వినోద్, గోపాల్, రమేశ్, పాలక్ రావు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మికి బుధవారం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. మహిళా కార్యకర్తలు కోవ లక్ష్మికి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం ఎక్స్‌రోడ్ నుంచి రెబ్బెన వరకు జాతీయ రహదారి వెంట బైక్‌ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనజ, సర్పంచులు సుమలత, అహల్యాదేవి, సోమశేఖర్, పోషమల్లు పాల్గొన్నారు.

'త్వరలో నిధులు మంజూరు చేస్తాం'



మాట్లాడుతున్న పురుషోత్తం

కెరమెరి: గతేడాది జరిగిన ఉత్సవాల్లో ఖర్చు చేసిన బిల్లులను త్వరలో మంజూరు చేస్తామని జైనూర్ ఏటీడీఏ పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని ఇందాపూర్ గ్రామ పమీపంలో ఉన్న ఆదిమ గిరిజనుల దేవతలు పోతురాజు, ధర్మరాజు ఆలయాన్ని ఆయన సందర్శించి ఆది దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా కొలాం సంఘం నాయకులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది రూ. 2,30,000 ఖర్చు కాగా కేవలం రూ.30,000 మాత్రమే అందాయని మిగితా బిల్లులు అందాల్సి ఉందన్నారు. నాయకులు సిడాం రాజు, సిడాం ధర్మూ, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఇంటర్ కళాశాలల్లో ఫస్టియర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 25లోగా ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్(టి) కళాశాలల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.